
జగన్నాథం బద్దకంగా ఒళ్లువిరిచి లేచాడు. కిటికీలో నుంచి చూసాడు. సూర్యుడు రాత్రంతా విశ్రాంతి తీసుకొని, అప్పుడే డ్యూటీలో ప్రవేశిస్తున్నాడు. కొండవెనక నుంచి నెమ్మదిగా బయటకు వస్తున్నాడు. జగన్నాథం నిలబడి, చేతులు జోడించి నమస్కరిస్తూ కళ్లు మూసుకొని ఆదిత్యహృదయం స్మరించుకున్నాడు. సూర్య భగవానునికి మనస్ఫూర్తిగా నమస్కరించి వేడుకుంటే ఆరోగ్యం, విజయం చేకూరుతాయి.

తన భార్య ఈ లోకాన్ని వీడిపోయినా, ఆమె ఆత్మశాంతి కోసం ప్రార్థించడం అతని దిన చర్యల్లో ఒకటి. తన పిల్లలు తనని ఒంటరిని చేసి వెళ్లిపోయినా, వారు క్షేమంగా వుండాలని కోరుకుంటాడు. టేబిల్‌పై ఉన్న కళ్లజోడు తీసి పెట్టుకుని, మార్నింగ్ వాక్‌కి బయలుదేరాడు. వినయంగా నమస్కరించిన సెక్యూరిటీని పలకరించి, ముందుకుసాగాడు.



# ప్రేమించే మనసు కావాలి

అమ్మాయికి పెళ్లి చేసి పంపించాడు. భార్య ఇహలోకబంధాలు తెంచుకొని వెళ్లిపోయింది. జగన్నాధానికి అంతా శూన్యం అనిపించింది. తనకి భార్యంటే ప్రాణం. ఆమె తనని ఎంత ప్రేమగా చూసుకోనేది! అనుక్షణం తన అవసరాలు, అంతరంగం తెలుసుకొని తదనుగుణంగా మసలుకొని, నీడలా అంటిపెట్టుకొని వుండేది. ఆమె స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. మానసికంగా కృంగిపోయాడు. కొడుకులిద్దరూ మంచి ఉద్యోగాల్లో చేరారు. వారికీ పెళ్లిళ్లు చేశాడు. అప్పుడు ఆ పుత్రరత్నాలకి తండ్రి భారమనిపించాడు. ఎవరికెవరంటూ తండ్రిని వదిలిపెట్టి ఎవరిదారి వారు చూసుకున్నారు. కొడుకులు కావాలనుకోవడం ఇందుకేనా? కూతురు ఎప్పటికయినా అత్తవారింటికి వెళ్లేదని ఆమెను చిన్నచూపు చూశాడు. ఆ కూతురే ఇప్పుడు తమ యింటికి వచ్చేయమంటోంది.

"వద్దమ్మా! కూతురు, అల్లుడింట్లో వుండడం బాగుండదు".

లాస్య బాధపడింది. "అదేంటి నాన్నా, అలా అంటారు? నేను మీ బిడ్డను కానా? మీ అల్లుడిగారి సంగతి మీకు తెలియదా? ఏమీ అనుకొనే మనిషికాదు. మా ఆయన అని చెప్పడం కాదు గానీ... మంచివారు".

"నా ఉద్దేశం అదికాదమ్మా. కొడుకులుండగా కూతురింట్లో వుంటే మీ అన్నలకి చెడ్డ పేరు. నువ్వు అనవసరంగా బాధపడకమ్మా" జగన్నాధం సున్నితంగా తిరస్కరించాడు.

లాస్య దగ్గరుండి తండ్రిని వృద్ధాశ్రమంలో చేర్పించింది. ఇంతమంది వుండి, కన్నతండ్రిని వృద్ధాశ్రమంలో చేర్చడం ఆమె గుండెను కలచివేసింది. తండ్రి ఆత్మాభిమానం గల మనిషి. అన్నల కాఠిన్యానికి, స్వార్ధానికీ అసహ్యం కలిగింది. తండ్రి ఆస్తి కావాలి కానీ తండ్రి అక్కర్లేదా? ఆస్తి కోసం ప్రేమ ఒలకబోసి, అది దక్కిన తర్వాత తండ్రిని దిక్కులేని వాడిలా ఎక్కడో వదిలేయడమేనా? లాస్య భోరున ఏడ్చింది. జగన్నాధం చాలా బాధపడ్డాడు. ఆడపిల్ల అనగానే చాలామంది చులకనగా మాట్లాడతారు. వంశోద్ధారకులని... ప్రత్యేకంగా చూస్తారు. తనూ అదే చేశాడు. పరాయింటికి వెళ్లిపోయిన కూతురు అభిమానించి ఆదరిస్తూంటే, కొడుకులు అవమానించి... నువ్వు మాకు బరువు, మాకక్కర్లేదు పొమ్మన్నారు. కూతురి తలమీద చేయివేసి, బాధపడకమ్మా... దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు" అన్నాడు.

గడచిన చేదు అనుభవాలను గుర్తుచేసుకుంటూ జగన్నాధం మార్నింగ్‌వాక్‌కి వెళ్లి వచ్చాడు. తన గదిలో ప్రవేశించాడు. అతనికి తన ముసలి తండ్రి గుర్తొచ్చాడు. తన తండ్రిని తను ఎంత ప్రేమగా, ఆప్యాయంగా చూసుకున్నాడు? జగన్నాధం తనకి వున్నాడనే భరోసా ఆ తండ్రికి ఎంతో తృప్తినిచ్చింది. కొడుకు ప్రేమలో అన్ని బాధలూ మరిచిపోయాడు. ఏ తండ్రికయినా అంతకంటే యింకేం కావాలి? ఆనాటి అదృష్టం ఈ రోజుల్లో ఏ కొద్దిమందికో దక్కు

**వి.ఎస్.ఆర్. మౌళి**

తుంది. జగన్నాథం ఆలోచించసాగాడు. తన కింత దురవస్థ ఎందుకొచ్చింది? తనేం లోటు చేశాడు? కొడుకులను కాలు క్రింద పెట్టనివ్వ కుండా, అడిగింది కాదనకుండా వారి అవస రాలు, సరదాలూ తీర్చాడు. అడుగులకు మడు గులొత్తాడు. అల్లారుముద్దుగా పెంచాడు. దానికిదా ఫలితం? తను కష్టపడ్డాడుగాని, వారి మనసులను ఏనాడూ కష్టపెట్టలేదే! తండ్రిగా తన బాధ్యత నెరవేర్చాడు. ఇంకా ఎక్కువే చేశాడు. అదే తను చేసిన తప్పా? తను ముందు జాగ్రత్త వహించివుంటే తనకు ఈనాడీ దుస్థితి వచ్చేదా? అది స్వార్థమవుతుందా? లేదు... అలా ఎన్నటికీ కాదు. అయినా ఇప్పు డు తనకేమయిందని? ఇక్కడంతా ప్రేమను పంచుకుంటారు, ఆప్యాయతలు పెంచుకుం టారు. గౌరవానికి లోటు లేదు.

కిటికీలోనుంచి తోటలోకి చూశాడు. కుక్క పిల్లలు తల్లితో ఆడుకొంటున్నాయి. తన పిల్లలు చిన్నప్పుడెలావుండేవారో గుర్తొచ్చి, రెండు కన్నీటి బొట్లు నెమ్మదిగా బుగ్గ మీద నుంచి కిందకి జారాయి. వాచ్‌మేన్ పిలుపుతో ఉలిక్కిపడ్డాడు. ఏమిటన్నట్లు చూశాడు.

"మిమ్మల్ని కలవాలని ఎవరో వచ్చారు" అన్నాడు వాచ్‌మేన్. ఆ ముసలి గుండెలో ఆనందం ఎగసిపడింది. కళ్లల్లో మెరుపు... కొన గోటితో కళ్లు తుడుచుకొంటూ "మా పిల్లలెవ రయినా వచ్చారా?" ఆశగా అడిగేడు.

"నాకు తెలియదుసార్. విజిటర్స్ రూమ్‌లో వున్నారు".

జగన్నాథం విజిటర్స్ రూము చేరుకున్నా డు. తన పిల్లలెవరో తనని చూడ్డానికొచ్చారన్న ఊహ ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆనందంతో గుండె త్వరగా కొట్టుకోసాగింది. విజిటర్స్ రూమ్‌లో ఓ యువకుడు కూర్చొనున్నాడు. అతని చేతిలో పెన్ను, ఓ నోట్‌బుక్కు వున్నాయి. గదిలో ఇంకె వరయినా వున్నారేమోనని ఆత్రుతగా చుట్టూ పరికించి చూశాడు జగన్నాథం. ఆహా... అపరి చిత యువకుడు తప్ప ఎవరూ లేరు. జగన్నా థం ఆ యువకుని దగ్గరకెళ్లాడు. ఆ యువకుడు లేచి నిలబడ్డాడు. వినయంగా "నమస్కారం జగన్నాథంగారండీ.." అంటూ చేయి చాచాడు. జగన్నాథం కరచాలనం చేశాడు.

"నా పేరు వినయ్. 'కాంతికిరణం' పత్రిక లో రిపోర్టర్ని" పరిచయం చేసుకున్నాడు యువ కుడు.

జగన్నాథానికి అర్థం కాలేదు. ఆశ్చర్యం కలిగింది. ఓ పత్రికా రిపోర్టర్‌కి తనతో ఏం పని? అయినా ఎవరో ఒకరు తనని చూడ్డాని కొచ్చారు. తనకీ ఓ గుర్తింపు ఉంది.

"నేను మీకేవిధంగా సాయపడగలను? నన్ను కలవమని ఎవరు చెప్పారు? సౌమ్యంగా అడిగాడు జగన్నాథం.


వినయ్ చిన్నగా నవ్వి "సార్! సిటీలోవున్న వృద్ధాశ్రమాల గురించి వరుసగా కథలు మా పత్రికలో వెయ్యాలని నిర్ణయించాం. ఆ విష యంగా మీతో మాట్లాడాలని వచ్చాను. మీ పక్కింటివారు మీ గురించి చెప్పి అడ్రసిచ్చారు" అన్నాడు.

"ఏం చెప్పగలను? నా భార్యపోయి అయి దేళ్లయింది. నా కొడుకులకి నేనక్కర్లేదు..." జగన్నాథం నిట్టూర్చాడు.

"ఇక్కడ జీవనస్థితిగతులెలాఉన్నాయి?"

"మేం బతుకుతున్నాం. అంతే..."

"మీ మాటలని బట్టి యిక్కడి పరిస్థితులు బాగులేవనుకోవచ్చా? అసలేం లోపం? భోజ




నం సరిగ్గా పెట్టరా? వాటర్ ప్రాబ్లమా? మిమ్మల్ని ప్రేమగా చూడరా?"

"అబ్బే... అన్నీ బాగానే వున్నాయి"

వినయ్ జగన్నాథం ముఖంలోకి చూశాడు. మరయితే లోటేంటి? ఆయన మాటల్లో ఆంతర్యం ఏమైవుంటుంది?

"చెప్పునాయనా! ప్రేమ లేకపోతే దాన్ని జీవితమనగలమా?" అడిగాడు జగన్నాథం.

వినయ్ ఒక్క క్షణం ఆలోచించి "ప్రేమ లేకున్నా జీవితం జీవితమే కదా!" అన్నాడు.

"బహుశా ఇంటి బయటికి పోయే పరిస్థితి నీకు రాలేదు. అయినా చిన్నవాడివి. అందుకే అలా మాట్లాడ్తున్నావు"

జగన్నాథం గొంతులో కాఠిన్యాన్ని పసిగట్టాడు. వినయ్‌కి ఈ పరిస్థితి చిత్రంగావుంది. ఆ ప్రదేశం, ఆ ముసలాయన సమక్షంలో అశాంతిగా, టెన్షన్‌గా వున్నట్లనిపించింది.

"బాబూ నేనిపుడు ఒంటరివాడ్ని. ఈ సంవత్సరం నా పిల్లలెవరూ నన్ను ఒక్కసారయినా చూడ్డానికి రాలేదు. చచ్చానో, బతికానో కూడా వారికక్కర్లేదు. నాకిద్దరు కొడుకులు, ఓ కూతురు వున్నారు చెప్పుకుందికి. ఈ పక్క తొంగిచూడరు" జగన్నాథం గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

వినయ్ ఆశ్చర్యపోయాడు. కన్న తండ్రిని ఎలా మరచిపోగలిగారు? వాళ్లు మనుష్యులేనా? జగన్నాథం గురించి బాధపడసాగేడు. కాస్సేపాగి వెళ్లడానికి లేచాడు వినయ్.

"బాబూ వినయ్, మళ్లీ ఓసారి రా" అన్నాడు జగన్నాథం.

"అలాగే సార్"

ఆ సాయంత్రం వినయ్ జగన్నాథం విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. మర్నాడు జగన్నాథం వినయ్ ఆఫీస్‌కి ఫోన్ చేశాడు. "బాబూ వినయ్, నేను జగన్నాథాన్ని... నువ్వో

సారి ఈవేళ రాగలవా? నీకు కొన్ని విషయాలు చెప్పాలి" అన్నాడు.

"తప్పకుండా వస్తాను సార్. సాయంత్రం ఆరు గంటలకి రమ్మన్నారా" వినయ్ గొంతులో సౌమ్యతకు, మర్యాదకు పొంగిపోయాడు జగన్నాథం.

"నేనా టైమ్‌లో వాకింగ్ చేస్తాను"

"అలా అయితే మనిద్దరం కలిసే నడుద్దాం"

"అయితే మంచిది. మరచిపోవద్దు" అన్నాడు జగన్నాథం.

ఆఫీస్ పని ముగించి వినయ్ సరిగా ఆరయ్యేసరికి వృద్ధాశ్రమం చేరుకున్నాడు. ఈసారి వాచ్‌మేన్ అతడ్ని తిన్నగా జగన్నాథం గది దగ్గర విడిచిపెట్టాడు. జగన్నాథం సాదరంగా అహ్వానించి, కుర్చీలో కూర్చుండబెట్టాడు.

"ఎలావున్నారు?" అడిగాడు వినయ్ ప్రేమగా. ఆ గొంతులో ప్రేమకు జగన్నాథం గుండె కదిలింది. నిట్టూర్చి, మరీ అంత బాగులేను... దగ్గసాగాడు. ఉధృతంగా దగ్గుతున్నాడు. వినయ్ ముఖంలోకి చూస్తూ గుండెను చేత్తో రాసుకుంటూ "వృద్ధుల సదనాలు, వివరాలు గల ఆర్టికల్స్‌ని న్యూస్‌పేపర్లు, మ్యాగజైన్ల నుంచి సేకరించాను. నీకేమన్నా పనికొస్తాయేమో చూడు. ఇవిగో" అని ఓ ఫైలిచ్చాడు. వాటిలో జగన్నాథం రాసిన అనుభవాలు కూడా వున్నాయి. వినయ్ ఫైలు చూడసాగాడు.

"చాలా మంచి ఇన్ఫర్మేషన్ ఇచ్చారు. థేంక్యూ సార్"

"నీ వయస్సెంత బాబూ?" జగన్నాథం అడిగాడు.

"ఇరవై నాలుగు. వచ్చే నెలకి ఇరవై అయిదొస్తాయి"

"చాలా మంచి వయసు. మంచి యవ్వనంలో వున్నావు. నాకీ వయస్సులోనే పెళ్లయింది" అన్నాడు జగన్నాథం.

"అలాగా" నవ్వుతూ చూశాడు వినయ్.

"నాకు స్వంత వ్యాపారం వుండేది. మా తండ్రి ఓ గుమాస్తా. క్రమంగా నా వ్యాపారం అభివృద్ధయింది. పిల్లలను బాగానే చదివించాను. అందరికీ పెళ్లిళ్లు చేశాను. కొడుకులు మంచి ఉద్యోగాల్లో చేరారు" కళ్లవెంబడి జారే కన్నీరు తుడుచుకున్నాడు. తన జీవితం గురించి చెప్తున్నప్పుడు కళ్లు మూసుకొని, ట్రాన్స్‌లో వున్నట్లు మాట్లాడుతున్నాడు.

"అయిదేళ్ల కిందట నా భార్య పోయింది" చిన్న పిల్లాడిలా ఏడిచాడు. వినయ్ కంగారు పడ్డాడు, జాలిపడ్డాడు. లేచి జగన్నాథం దగ్గర కెళ్లి అతని భుజం మీద చెయ్యివేసి తడుతూ...

"దయచేసి ఏడవకండి" అన్నాడు అనునయంగా. జగన్నాథం ఏడుపు ఆపాడు. కాస్సేపుండి వినయ్ వెళ్లిపోయాడు.

వినయ్ రాసిన వ్యాసాలు 'కాంతికిరణం'లో వరుసగా వచ్చాయి. అవి ఎందరినో ఆకర్షించాయి. ఆలోచనకి, ఆవేదనకీ గురిచేశాయి. వినయ్‌కి, జగన్నాథానికీ మధ్య ఏదో అనుబంధం పెనవేసుకుంది. అయిదారుసార్లు కలుసుకున్నారు. వినయ్ జగన్నాథానికి ఓ మనవడిగా, జగన్నాథం వినయ్‌కి తాతగా ఇద్దరి మనసుల్లో అనిపించింది.

ఆ రోజు జగన్నాథం సంతోషంగా వున్నాడు. వినయ్‌కి ఫోన్ చేశాడు. వినయ్ జగన్నాథంగార్ని గుర్తుపట్టి...

"ఎలావున్నారు సార్" అనడిగాడు.

"బాబూ, నేనేం చెప్పబోతున్నానో ఊహిం




చు...” అన్నాడు.

అతని గొంతులో ధ్వనించిన ఉద్వేగం వినయ్‌ని ఆశ్చర్యపరచింది.

“ఏమిటి సార్! చాలా సంతోషంగా వున్నట్టున్నారు”

“అవును వినయ్. నేను ఒంటరివాడ్నికాను. నా కూతురితో పదిహేను రోజులు... ఫిఫ్టీన్ డేస్... గడపబోతున్నాను అన్నాడు జగన్నాథం.

“ఈజిట్? చాలా సంతోషం సార్. కానీ సార్... పన్నెండో తేదీన నా బర్త్‌డే. మీరు తప్పకరావాలి”

“నేను రాకుండా ఎలావుంటాను? అయితే మా అమ్మాయీ రావాలి”

“వస్తారు. నేను ఫోన్ చేస్తాను. సరే సార్ కంగ్రాట్స్. బీ హ్యాపీ”

“వుంటాను బాబూ”

వినయ్ బర్త్‌డే యింకా రెండ్రోజులుంది. ఆ రోజు పదోతేదీ. జగన్నాథం నుంచి ఏ భోగట్టా లేదు. వినయ్ వృద్ధాశ్రమానికి ఫోన్ చేశాడు. వాచ్‌మేన్ ఫోనందుకున్నాడు.

“జగన్నాథం గారున్నారా!”

“లేరు. మీరెవరు మాట్లాడేది?”

“నా పేరు వినయ్. కాంతికిరణం పత్రిక రిపోర్టర్‌ని. జగన్నాథం గారి దగ్గరకి చాలాసార్లు వచ్చాను”

“వారు కూతురిగారింటికెళ్లారు”

“ఆయన ఏమైనా చెప్పారా”

“సారీ... ఏం చెప్పలేదండీ”

* * *

ఆ రోజు పన్నెండో తేదీ. జగన్నాథంగారి ఫోన్ కోసం ఆశగా ఫోన్‌వైపు చూస్తున్నాడు వినయ్. కానీ ఫోన్ రాలేదు. పార్టీకి ఫ్రెండ్స్ వచ్చినా వినయ్‌కి వెలితిగా అనిపించింది.

అన్యమనస్కంగా గడిపాడు.

ఓ వారం తర్వాత యింటికి వచ్చిన వినయ్‌కి వృద్ధాశ్రమం నుంచి ఫోన్ వచ్చిందని తెల్సింది. కానీ మెసేజ్ లేదు. జగన్నాథంగారు ఆశ్రమానికొచ్చేసుంటారని అనుకున్నాడు. ఆశ్రమానికి ఫోన్ చేస్తే ఎంగేజ్ సౌండ్ వస్తోంది. స్వయంగా వెళ్లి కలుద్దామని బయల్దేరాడు. జగన్నాథం ఫోన్ చేయలేదని బాధ పడ్డాడు. ఒంట్లో బాగులేదా? మరచిపోయాడా?

వినయ్‌ని చూసి వాచ్‌మేన్ ఎవరు కావాలనడిగాడు. వినయ్ చెప్పాడు "జగన్నాథంగారి గురించి తరచూ వచ్చేవారు మీరేనా సార్" అడిగాడు వాచ్‌మేన్ వినయ్‌ని.

"అవును, ఇంతకీ ఆయన వచ్చారా?"

"ఇంకెక్కడ జగన్నాథంగారు సార్? అందర్నీ వదిలి వెళ్లిపోయారు" వాచ్‌మేన్ మాటలు నమ్మనట్లు "ఏంటీ! ఈ ఆశ్రమం వదిలి, కూతురింటికెళ్లిపోయారా?" అడిగాడు వినయ్.

"కూతురింట్లోనే చనిపోయారు సార్"

వినయ్ వెన్నెముకలో వణుకు. "ఎప్పుడు?" అన్నాడు నీర్సంగా...

"పన్నెండో తేదీన"

కొరడాతో కొట్టినట్లయింది వినయ్‌కి. అంటే తన బర్త్‌డే నాడు. గుడ్‌గాడ్! ఎలా జరిగింది?

"వాచ్‌మేన్! ఆయన కూతురి ఫోన్ నెంబరుందా?"

"వుంది సార్"

వినయ్ ఫోన్ చేశాడు.

"హల్లో..." ఆడగొంతు.

"నా పేరు వినయ్. జగన్నాథంగారి కుమార్తె గారితో మాట్లాడాలి"

"చెప్పండి, నేనే మాట్లాడుతున్నాను"

"వెరీ సారీ, నాకిపుడే తెల్సింది"

"ఔనండీ. మీరేనా వినయ్?... 'కాంతి కిరణం' రిపోర్టర్. నాన్నగారు మీ గురించి చాలా చెప్పారు. చనిపోవడానికి ముందు రోజు రాత్రి మీ పరిచయం, మీటింగు, మీ ఆర్టికల్స్ గురించి, మీ మంచితనం అన్నీ చెప్పారు. మీరంటే తనకి చాలా ఇష్టమని, ఆత్మీయుని చూసినట్లుంటుందని చెప్పారు.

ఫోన్‌లో వినయ్ వెక్కుతున్న శబ్దం.

అవును మేడమ్... నాకూ అలాగే అనిపించింది.

"వినయ్‌గారూ, తన కన్న కొడుకులు తనను వదిలేశారని బాధపడ్తున్న మా నాన్నకి మీ పరిచయం ఎంతో ఆనందం కలిగించింది. తనని అభిమానించే ఆత్మీయుడు దొరికారని మురిసిపోయారు"

వినయ్ ఫోన్ పెట్టేశాడు.

అతని బుగ్గల మీద నుంచి కన్నీరు జారి పడుతోంది. గుండె భారమైంది. జగన్నాథం గారిపుడు ఒంటరి కాదు. తన భార్యను చేరుకున్నారు.

ఆకాశంవైపు చూశాడు. సూర్యుడస్తమిస్తున్నాడు. మేఘాలు చూస్తూండగానే ఓ ఆకారంగా ఏర్పడ్డాయి. అది జగన్నాథంగారి రూపం దాల్చింది. రెండు చేతులూ దీవిస్తున్నట్లు చాచి... "సారీ మైబాయ్ వినయ్, నీ బర్త్‌డేకి రాలేకపోయాను. అప్పటికే నా టైమైపోయింది" అంటున్నట్లనిపించింది. ●